# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 26 । ఆగస్టు । 2025






**ఉద్రిక్తతల నడుమ అంత్యక్రియలు**

అశ్వారావుపేటకు చెందిన లక్ష్మీప్రసన్న ఆదివారం మృతిచెందగా.. ఉద్రిక్తతల నడుమ సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. 8లో



**.. మేధస్సుకు కథలు!**

ప్రతి రోజూ ఐదు నిమిషాల పాటు యోగా లేదా ధ్యానం ద్వారా విద్యార్థులకు ప్రయోజనాలు కలుగుతాయని అంటున్నారు 8లో

గరిష్టం / కనిష్టం
29° / 24°

**వాతావరణం**

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### 30న జిల్లాలో సీఎం పర్యటన ?

దామరచర్లలో సభాస్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే జారే



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

చండ్రుగొండ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 30న జిల్లాలో పర్యటించనున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో సోమవారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మండలంలోని దామరచర్ల గ్రామ శివారులో ఏర్పాటు చేసిన సభాస్థలిని, చండ్రుగొండలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను పరిశీలించారు. సీఎం పర్యటన దాదాపు ఖరారైనట్లు అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఈనెల 21న బెండాలపాడులో సీఎం పర్యటించి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తారని ముందు ప్రకటించగా ఆ కార్యక్రమం వాయిదా పడిన విషయం తెలిసిందే.

### అంతర్జాతీయ కుంగ్‌ఫూ పోటీల్లో పతకాలు



గెలుపొందిన పతకాలతో విజేతలు

గుండాల/కొత్తగూడెంటౌన్ : హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన అంతర్జాతీయ కుంగ్ ఫు కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు పతకాలు సాధించారు. గుండాలకు చెందిన మంకిడి చరణ్ తేజ్, గుగులోత్ గౌతమ్, సట్టు ఉదయ్‌కిరణ్ మూడు విభాగాల్లో ప్రథమ స్థానం సాధించారు. అండర్–15 విభాగంలో జిల్లాకు చెందిన కె.లిఖిత్‌చరణ్ కటాస్‌లో బంగారు పతకం, అండర్–10లో బి.భానుకృష్ణ రజిత పతకం, అండర్–12 బాలికల విభాగంలో ఎ.ఆశ్రిత కటాస్‌లో బంగారు పతకం, అండర్–10 బాలికల విభాగం కటాస్‌లో ఎస్.షణ్ముఖశ్రీ కాంస్య పతకం సాధించారు. కాగా, విజేతలను అంతర్జాతీయ కరాటే మాజీ క్రీడాకారుడు పి.కాశీహుస్సేన్, కోచ్ నిహారిక, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నాగ సీతారాములు, జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సాబీర్‌పాషా, జిల్లా కుంగ్‌ఫు కరాటే మాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐ.ఆదినారాయణ తదితరులు అభినందించారు.

### బీసీ సంక్షేమాధికారిగా విజయలక్ష్మి



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న విజయలక్ష్మి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా బీసీ సంక్షేమాధికారిగా పి.విజయలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఇప్పటివరకు జిల్లాలో ఈ విధులు నిర్వహించిన ఇందిర భూపాలపల్లికి బదిలీ అయ్యారు. కాగా, విజయలక్ష్మి గతంలో బీసీ అభివృద్ధి అధికారిగా పని చేయగా, పదోన్నతి లభించింది.

# సమయమే సమస్య!



### సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి వ్యయం అధికం

- తక్కువ ధరకు అందిస్తూ కోలిండియా సవాల్
- సగం సమయం వృథాగా ఉంటున్న భారీ యంత్రాలు
- ఉద్యోగులతోనూ 8 గంటలు పని చేయించాలంటున్న కార్మికులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నిన్నా మొన్నటి వరకు దక్షిణ భారతదేశ పారిశ్రామిక అవసరాలకు బొగ్గు సరఫరాలో సింగరేణి సంస్థకు తిరుగులేదు. కానీ ఇప్పుడు కోలిండియా నుంచి తీవ్ర పోటీ ఎదురవుతోంది. ఈ పోటీ నుంచి గట్టెక్కాలంటే ఉత్పత్తి వ్యయం తగ్గించుకోవడం మినహా సింగరేణికి మరోదారి లేని పరిస్థితి కనిపిస్తోంది.

**చేజారిపోతున్న వినియోగదారులు..**

ఈ ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో 80 శాతానికి పైగా బొగ్గు దక్షిణ భారత దేశంలో ఉన్న థర్మల్ విద్యుత్ సంస్థలకు సరఫరా చేస్తోంది. అయితే బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరకే బొగ్గు లభిస్తుండడం సంస్థకు సంకట పరిస్థితిని తెస్తోంది. ఇప్పటికే నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) సంస్థ సింగరేణితో కోల్ లింకేజీపై పునరాలోచన చేస్తుండగా.. ఇప్పుడు అదే బాటలో కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ జెన్కోలు నడుస్తున్నాయి. సింగరేణి సరఫరా చేస్తున్న బొగ్గు ధరతో పోల్చితే తక్కువ ధరకే అందిస్తామని థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు కోలిండియా ఆఫర్ ఇస్తోంది. రవాణా ఖర్చులన్నీ కలిపినా ఒక్కో టన్నుపై సగటున రూ.600 వరకు తక్కువ ధరకు కోలిండియా బొగ్గు అందుబాటులో ఉంటోంది. దీంతో ఉత్పత్తి వ్యయం తగ్గించుకోవడం మినహా సింగరేణికి మరో మార్గం లేదు. కార్మికుల గైర్హాజరు, ఉద్యోగుల పని గంటల్లో సమానత్వం, భారీ యంత్రాల వినియోగ సమయంలో సమర్థత వంటి విషయాల్లో సంస్థ వెనుకబడిపోతోంది.

| థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సంస్థ | కోల్ లింకేజీ (సాలీనా) |
|---|---|
| ఎన్టీపీసీ | 38 మి. టన్నులు |
| కర్ణాటక | 10 మి. టన్నులు |
| ఏపీ | 7 మి. టన్నులు |

**వారికి ఏడు గంటల పనే..**

సింగరేణి సంస్థ పరిధిలో 40 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. ఇందులో బొగ్గు ఉత్పత్తిలో నేరుగా సంబంధం ఉండే కార్మికులు, ఇతర మైనింగ్ సిబ్బంది, అధికారులకు ఎనిమిది గంటల పని విధానం అమల్లో ఉంది. కానీ కంపెనీ లావాదేవీలు, కార్మికుల సంక్షేమం తదితర కార్యాలయ విధులు నిర్వహించే ఉద్యోగులకు ఇప్పటికీ ఏడు గంటల పని విధానమే అమలవుతోంది. బ్రిటీషర్ల కాలంలో ప్రమాదకరమైన బొగ్గు ఉత్పత్తిలో ఉండే కార్మికులకు ఎక్కువ పని గంటలు ఉండగా, అడ్మినిస్ట్రేషన్ వైపు ఉండే బ్రిటీష్ వారికి తక్కువ పని గంటలు ఉండేవి. అయితే ఇప్పటికీ ఇదే విధానం అమలు కావడం ఏంటని కార్మికుల నుంచి నిరసనలు వస్తున్నాయి. సంస్థలో అందరికీ ఒకే విధమైన పని గంటల విధానం అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ఇలా అయితే ఎలా..?**

సింగరేణి బొగ్గు ఉత్పత్తిలో ఇప్పుడు భారీ యంత్రాలదే కీలక పాత్ర. ఓవర్ బర్డెన్ (మట్టి), బొగ్గు వెలికి తీయడం, భారీ యంత్రాల ద్వారా వెలుపలికి తీసుకురావడం.. ఇలా బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో కీలకంగా వ్యవహరించే భారీ యంత్రాలు సంస్థ ఆధీనంలో 814 ఉన్నాయి. ఈ యంత్రాలను సగటున రోజుకు 18.20 గంటల పాటు నడిపించాల్సి ఉంటుంది. కానీ వివిధ కారణాలతో ప్రస్తుతం ఈ భారీ యంత్రాల వినియోగ సమయం సగటున 7.90 గంటలుగానే ఉంది. అంటే భారీ యంత్రాల గరిష్ట వినియోగ సమయంలో సగం కూడా ఉత్పత్తి కోసం వాడడం లేదు. దీంతో ఈ యంత్రాలపై పెట్టిన పెట్టుబడి, రుణాలకు వడ్డీ, యంత్రాలు నడిపే ఆపరేటర్ల వేతనాలు ఇలా అన్ని రకాలుగా వృథా అవుతోంది. ఫలితంగా బొగ్గు ఉత్పత్తి వ్యయం పెరుగుతోంది.

**సంస్థలో యంత్రాల వినియోగం ఇలా..**

| యంత్రాలు | సంఖ్య | పని చేయాల్సిన గంటలు | వినియోగించే గంటలు |
|---|---|---|---|
| షావెళ్లు | 66 | 19.70 | 12.70 |
| డంపర్లు | 417 | 18.70 | 9.40 |
| డోజర్లు | 109 | 16.10 | 4.80 |
| డెరిల్స్ | 48 | 19.70 | 6.50 |
| ఇతర యంత్రాలు | 174 | 18.20 | 7.90 |
| మొత్తం | 814 | 18.20 | 7.90 |

# 13 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

- 12 సెల్‌ఫోన్‌లు, బ్యాంకు పాస్‌బుక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: సైబర్ మోసాలకు పాల్పడిన టేకులపల్లికి చెందిన 13 మంది యువకులు జైలు పాలయ్యారు. జిల్లాలో సైబర్ నేరాలకు పాల్పడుతున్న వీరిని టేకులపల్లి, సైబర్ క్రైం పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేయగా.. స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ రోహిత్‌రాజు సోమవారం వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. టేకులపల్లిలో మీ సేవా కేంద్రం నిర్వహిస్తున్న బోడ శ్రీధర్‌కు టెలిగ్రామ్ యాప్ ద్వారా పరిచయమైన సైబర్ నేరగాళ్లు నగదు బదిలీ చేస్తే కమీషన్ ఇస్తామని చెప్పారు. దీంతో శ్రీధర్ మరో 12 మందితో కలిసి సైబర్ మోసాలకు పాల్పడ్డారు. టేకులపల్లి మండలానికి చెందిన పలువురితో నకిలీ పత్రాలు సృష్టించి 60 కరెంట్ అకౌంట్లు తెరిచి ఇతరుల బ్యాంకు ఖాతాలోకి నగదును పంపిస్తూ కమీషన్ తీసుకుంటున్నారు. టేకులపల్లి మండలానికి చెందిన బోడ శ్రీధర్, బోడ రాజేష్, బోడ రాజన్న, బానోతు జగదీష్, తేజావత్ నరేష్, పోలేపొంగు పవన్ కళ్యాణ్, భూక్యా వీరన్న, జాటోతు నరేష్, బోడ జంపన్న, బోడ రాజారాం, భూక్య ప్రవీణ్‌కుమార్, మాలోతు ప్రవీణ్, ఉరిమల్ల భరత్‌కృష్ణ కలిసి సైబర్ మోసాలకు పాల్పడుతూ.. గత ఆరు నెలలుగా మొత్తం రూ.8.5 కోట్లు లావాదేవీలు జరిపినట్లు గుర్తించామని, అందుకు కారణమైన ఈ 13 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 12 సెల్‌ఫోన్‌లు, బ్యాంకు పాస్‌బుక్ స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. నిందితులను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం ఇల్లెందు కోర్టుకు తరలించామని తెలిపారు. సమావేశంలో టేకులపల్లి, సైబర్ క్రైం సీఐలు బి.సత్యనారాయణ, ఎస్ఐ ఎ. రాజేందర్ పాల్గొన్నారు.

### నూరు శాతం అక్షరాస్యత సాధనకే 'ఉల్లాస్'

డీఈఓ నాగలక్ష్మి

సుజాతనగర్ : జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఇందుకోసం ఉల్లాస్ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని డీఈఓ బి.నాగలక్ష్మి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉల్లాస్ శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. నిరక్షరాస్యులకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల పర్యవేక్షణలో వలంటీర్లు స్వచ్ఛందంగా బోధిస్తారని చెప్పారు. ఓపెన్ స్కూళ్ల అవకాశాన్ని కూడా అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మధ్యలో చదువు మానేసిన వారు, ఉద్యోగం చేస్తున్నవారు, గృహిణులకు ఓపెన్ విధానం ఎంతో మేలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ లీల, సీఎం సైదులు, ఎమ్మార్పీలు శేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోండి

భద్రాచలం: ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా గణేష్ నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ఉత్సవ కమిటీలు బాధ్యతగా వ్యవహరించాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట సూచించారు. సబ్ కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, మండపాల నిర్వాహకులతో సమావేశమైన ఆయన మాట్లాడారు. మండపాల నిర్వాహకులు తప్పక రిజిస్ట్రేషన్ చేసుకుని అధికారులకు పూర్తివివరాలు అందించాలన్నారు. విద్యుత్ కనెక్షన్లు, మైక్‌ల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని చెప్పారు. ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, వివిధ శాఖల అధికారులు డి.అజయ్‌కుమార్, ఇంతియాజ్ ఖాన్, బి.హరిలాల్, పుల్లయ్య, చైతన్య, ధనియాల వెంకటేశ్వర్లు, నారాయణ పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన ఏడీఏ

**రూ.25 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు**



ఏసీబీకి పట్టుబడిన ఏడీఏ నరసింహారావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎరువుల దుకాణం యజమాని నుంచి రూ. 25వేలు లంచం తీసుకుంటూ కొత్తగూడెం వ్యవసాయ శాఖ ఏడీఏ నరసింహారావు సోమవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీదేవిపల్లి మండలం బంగారుచెలక గ్రామంలో ఎరువుల షాపు యజమాని నిబంధనలకు విరుద్ధంగా యూరియా విక్రయిస్తున్నాడంటూ ఏడీఏ నరసింహారావు షోకాజ్ నోటీసు ఇచ్చారు. తాను నిబంధనల ప్రకారమే అమ్ముతున్నానని, షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలని దుకాణం యజమాని ఏడీఏను కోరగా రూ.50వేలు లంచంగా డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఆ శాఖ అధికారుల సూచన మేరకు షాపు యజమాని ఏడీఏ వద్దకు వెళ్లి రూ.50 వేలు ఇవ్వలేనని, కొంత తగ్గించమని కోరగా.. చివరకు రూ.25వేలకు బేరం కుదిరింది. ఈ క్రమంలో సోమవారం చుంచుపల్లి మండలం విద్యానగర్‌లోని తన కార్యాలయంలో ఏడీఏ రూ. 25 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# కూరగాయల సాగుతో అదనపు ఆదాయం

**కలెక్టర్ జితేష్ వి పాటిల్**



కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్

సుజాతనగర్: కూరగాయల సాగుతో రైతులు అదనపు ఆదాయం పొందొచ్చని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. సుజాతనగర్, కొత్త అంజనాపురం గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో సాగు చేస్తున్న కూరగాయల తోటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో కనీసం 10 గుంటల స్థలం కలిగిన ప్రతీ మహిళా రైతు కూరగాయల సాగుకు ముందుకు రావాలని అన్నారు. ఇందుకు అవసరమయ్యే జీఐ వైరు, వెదురుగడలు, పాలిథిన్ పేపర్, విత్తనాలు, ఫెన్సింగ్‌లకు తక్కువ ఖర్చుతో డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టును రెండు రోజుల్లో ఇవ్వాలని, ఆ రిపోర్ట్ ఆధారంగా జిల్లాలో 1000 మంది మహిళా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిని సందర్శించి ల్యాబ్, మందుల గదిని పరిశీలించారు. మందులు సరిపడా ఉన్నాయా అని వైద్యాధికారి రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ర్యాపిడ్ కిట్లు, వ్యాక్సిన్ల నిల్వలను తనిఖీ చేశారు. ఆ తర్వాత రాఘవాపురం రహదారి పక్కన ఏర్పాటు చేసిన కొర్రమేను చేపల పెంపకం యూనిట్‌ను పరిశీలించిన కలెక్టర్ నిర్వాహకులను అభినందించారు. అక్కడే కూరగాయల సాగు, కౌజు పిట్టల పెంపకం చేపడితే అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ శౌరభ్‌శర్మ, ఫాం ఏపీఎం వెంకయ్య, తహసీల్దార్ వనం కృష్ణప్రసాద్, ఎంపీడీఓ బి.భారతి, ఏపీఎం రాంబాబు, ఏఓ జి.నర్మద, సీసీ శిరీష తదితరులు పాల్గొన్నారు.

**ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించాలి..**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 21 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల ప్రారంభానికి అనుమతి వచ్చిందని, నాలుగేళ్లు నిండిన చిన్నారులను బడిలో చేర్పించేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. పిల్లలకు కావాల్సిన యూనిఫాం, పుస్తకాలు, క్రీడా పరికరాలతో పాటు మధ్యాహ్న భోజనం, అల్పాహారం అందిస్తామని తెలిపారు. ప్రతి పాఠశాలలో కనీసం 20 మంది పిల్లలు ఉండేలా చూడాలని, సెప్టెంబర్ 1 నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. సమావేశంలో డీఈఓ నాగలక్ష్మి, అదనపు కలెక్టర విద్యాచందన, డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనీనా పాల్గొన్నారు.

**కౌజు పిట్టల యూనిట్ సందర్శన..**

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం శేషగిరినగర్‌లో పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన కౌజు పిట్టల పెంపకం యూనిట్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో తొలిసారిగా కౌజు పిట్టల పెంపకం యూనిట్‌ను ప్రారంభించిన ప్రణజతో పాటు మహిళా సంఘాలను అభినందించారు. ప్రతి మండలంలోనూ మహిళా సంఘాలు కౌజు పిట్టలను పెంచాలని, దాని ద్వారా అదనపు ఆదాయం పొందొచ్చని సూచించారు. 40 రోజులకోసారి వీటిని అమ్ముకోవచ్చని, మార్కెట్‌లో డిమాండ్ బాగా ఉంటుందని తెలిపారు. దీంతో పాటు పైలట్ ప్రాజెక్ట్‌గా లక్ష్మీదేవిపల్లి మండలంలోని రైతు వేదికలో కూరగాయల సాగు, మునగ సాగు, కొర్రమీను చేపల పెంపకం, కౌజు పిట్టల పెంపకాన్ని మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టి పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ పాల్గొన్నారు.

# సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

**ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్**



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యల పరిష్కారానికి ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై ఆయా శాఖల అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల్లో కొన్ని..

- జూలూరుపాడు మండలం కొమ్ముగూడెంలో గతంలో నిర్మించిన పశువుల ఆస్పత్రి శిథిలావస్థకు చేరిందని, పశు వైద్యానికి ఇబ్బందిగా ఉందని, నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు దరఖాస్తు చేయగా పశుసంవర్థక శాఖాధికారికి ఎండార్స్ చేశారు.
- బూర్గంపాడు మండలం చింతకుంటలో 37 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, ప్రధాన రహదారి నుంచి గ్రామానికి సరైన రోడ్డు లేదని, తాగునీటి సమస్య ఉందని, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ పాఠశాల లేదని, విద్యుత్ సౌకర్యం కూడా లేదని గ్రామస్తులు చేసిన దరఖాస్తును తగిన చర్యల నిమిత్తం కలెక్టరేట్ డీ సెక్షన్ సూపరింటెండెంట్‌కు ఎండార్స్ చేశారు.
- స్థానిక సంస్థల ఎన్నికలలో ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని మాదిగ జేఏసీ రాష్ట్ర సెక్రటరీ మోదుగు జోగారావు, బహుజన సంఘాల జిల్లా కన్వీనర్ వేల్పుల నరసింహారావు దరఖాస్తు చేశారు.
- రేషన్ డీలర్లకు ఐదు నెలల కమీషన్ అందించాలని, లేదంటే సెప్టెంబర్ 5 నుంచి సమ్మె చేస్తామని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఊకే శేఖర్‌రావు వినతిపత్రం అందించారు.

# పోడు విస్తరణను అరికట్టాలి

**సీసీఎఫ్ భీమానాయక్**



మీటింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న భీమానాయక్ తదితరులు

పాల్వంచరూరల్ : జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో కొత్తగా పోడుసాగు విస్తరణ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ డాక్టర్ బి.భీమానాయక్ అధికారులను ఆదేశించారు. డీఎఫ్ఓ కిష్టాగౌడ్‌తో కలిసి సోమవారం ఆయన పాల్వంచ వైల్డ్‌లైఫ్ డివిజన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ కార్యాలయంలో రూ.6లక్షల వ్యయంతో పునర్నిర్మాణం చేసిన మీటింగ్ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లా అటవీ ప్రాంతంలో బీట్ల వారీగా నిరంతరం పర్యవేక్షించాలని, కొత్తగా పోడు సాగు చేసే వారిపై కేసులు నమోదు చేయాలని చెప్పారు. కొత్తగా పోడు సాగైతే ఆ ప్రాంత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ తర్వాత పాల్వంచ అటవీ డివిజన్ పరిధిలోని టేకులచెరువు, అంజనాపురం బీట్లలోని ప్లాంటేషన్‌ను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ కట్టా దామోదర్‌రెడ్డి, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ బాబు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఐటీడీఏ పీఓ రాహుల్**



గిరిజనుల సమస్యలు వింటున్న పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజనాభివృద్ధి కోసం ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఐటీడీఏ సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వినతులు స్వీకరించి, పరిష్కారానికి సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హతల మేరకు దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా అధికారులు కృషిచేయాలని సూచించారు. స్వయం ఉపాధి, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు స్థాపించుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని గిరిజనులను కోరారు. సోలార్ ద్వారా బోరు బావులు తవ్వించాలని, రాజీవ్ యువ వికాసం ద్వారా రుణాలు ఇప్పించాలని, పోడు భూముల సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, గిరిజన గ్రామాల్లో రోడ్డు సౌకర్యం తదితర సమస్యలపై దరఖాస్తులు అందించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, ఏఓ రాంబాబు, డీడీ మణెమ్మ, గురుకులాల ఆర్‌సీఓ అరుణకుమారి, ఈఈ హరీష్, ఏడీఎంహెచ్ఓ సైదులు, ఎస్ఓ భాస్కరన్, ఉద్యానవనాధికారి ఉదయ్‌కుమార్, ఏపీఓ వేణు, లింగానాయక్, రాజారావు పాల్గొన్నారు.

**గిరిజన విద్యార్థులకు అభినందన..**

వివిధ అంశాల్లో రాణిస్తున్న గిరిజన విద్యార్థులను పీఓ రాహుల్ తన చాంబర్‌లో అభినందించారు. హనుమకొండలో 34వ సౌత్ జోన్ మీట్ రాష్ట్రస్థాయి పోటీల్లో భద్రాచలానికి చెందిన బట్ట పృథ్వీక, జావలిన్‌త్రోలో ఎస్.కె అమ్రిన్, కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చగా వారిని అభినందించారు. వారికి రెండు జతల ట్రాకింగ్ షూస్ అందించారు. అదేవిధంగా చిత్ర కళలో రాణిస్తున్న ఇర్పా స్వాతి పెయింటింగ్‌లను పరిశీలించారు.